**లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎమ్మెల్యే..**

జైపూర్: అసెంబ్లీలో ప్రశ్నలు అడగకుండా ఉండటానికి లంచం తీసుకున్న కేసులో రాజస్థాన్ ఎమ్మెల్యే అరెస్టయ్యారు. బాగిడోరాకు చెందిన భారత్ ఆదివాసీ పార్టీ ఎమ్మెల్యే జైకృష్ణ పటేల్ . అసెంబ్లీలో మైనింగ్ సంబంధించి మూడు ప్రశ్నలు అడిగేందుకు సిద్ధమయ్యారు. అయితే వాటిని తొలగించేందుకు సంబంధిత మైనింగ్ కంపెనీ ఎమ్మెల్యేను సంప్రదించింది. దీనికిగాను జైకృష్ణ రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. అయితే అది రూ.2.5 కోట్లకు ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో తొలుత సంబంధిత కంపెనీ అతనికి రూ.లక్ష అందించింది. రెండో విడుతలో భాగంగా రూ.20 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో అధికారులు ఎమ్మెల్యేకు ఉచ్చు బిగించారు. ఈ క్రమంలో డబ్బు ఇచ్చేందుకు జైపూర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని సంబంధిత వ్యక్తులకు ఎమ్మెల్యే జైకృష్ణ సూచించారు. దీంతో వారు ఆయన క్వార్టర్స్‌లో రూ.20 లక్షలు అందించారు. ఆ మొత్తాన్ని స్వయంగా లెక్కించిన తర్వాత ఆయన తన సహాయకుడితో పంపించారు. ఇంతలో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. అయితే అప్పటికే ఆ వ్యక్తి బ్యాగుతో అక్కడినుంచి పరారయ్యాడు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :63 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 06-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## భూమి కోసం, భుక్తి కోసం పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది..



ఆదిలాబాద్ : చీకటి ఉండే చోట వెలుగులు నింపాలని, ఆదిలాబాద్ జిల్లా ప్రజల సమ్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.కొమురం భీం జిల్లా: తెలంగాణ లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పర్యటిస్తున్నారు . కొమురం భీం జిల్లా లోని కాగజ్‌నగర్ లో రూ. 3,694 కోట్లతో ఐదు జాతీయ రహదారులను ప్రారంభించారు. . ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, బండి సంజయ్ కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సీతక్క , ఎంపీలు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక పైనుంచే 7 జాతీయరహదారులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం.. జిల్లా ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారని, ఆదిలాబాద్ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిందని, ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు.

చీకటి ఉండే చోట వెలుగులు నింపాలి...

చీకటి ఉండే చోట వెలుగులు నింపాలని, తనకు 13 డాక్టరేట్లు ఉన్నాయని.. తాను ఇంజనీరును కానని, అయినా 13 డాక్టరేట్లు ఉన్నాయని నితిన్ గడ్కరీ చెప్పారు. ఇక్కడి ప్రజల సమ్యలు అర్థం చేసుకునే రోజు వచ్చిందని అన్నారు. పీఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని, రోడ్లు బాగున్న దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ–మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుందని, భద్రాద్రి, బాసర, మేడారం ఆధ్యాత్మిక క్షేత్రాలు హైవేతో అనుసంధానం చేస్తామని చెప్పారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మిస్తామన్నారు. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. జగిత్యాల– కరీంనగర్ హైవే విస్తరణ వేగవంతం చేస్తామని, వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులే దేశాభివృద్ధి అని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.

గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం...

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని... అభివృద్ధి విషయంలో కాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ నమ్ముతారని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని ఆయన అన్నారు. తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు...కేంద్రం రూ. 1.25 లక్షల కోట్లు కేటాయించిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గాయి..కిషన్ రెడ్డి

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీనే లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రూ. 3,694.4 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు జరిగాయని, హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయని.. సమయం తగ్గిందని అన్నారు.రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హైవేల విస్తీర్ణం 5 వేల కిలోమీటర్లు దాటిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.. సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడుతారు..

హైదరాబాద్,మినిస్టర్ క్వార్టర్స్ లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ఆర్టీసీ సమస్యలపై ఆర్టీసీ సంక్షేమం కోరే ఎవరైనా ఈరోజు, రేపు ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు మీకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటానని తెలిపారు. ఆర్టీసీ సమస్యలు వినడానికి నేను కానీ మా ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు.ఆర్టీసీ సంస్థ పరిరక్షణ,కార్మికుల సంక్షేమం ,ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యత ఇస్తుంది. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.. సమస్యలు తొలుగుతున్నాయి. సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నానని వెల్లడించారు. ఆర్టీసీకి 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశాం.. ఒక్కటైన ఇబ్బంది పెట్టమా.. ఆర్టీసీ సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడుతారు.. గత 10 సంవత్సరాలుగా ఆర్టీసీని నిర్వీర్యం చేశారు.. ఒక్క బస్సు కొనుగోలు చేయలేదు, ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు వాడుకున్నారు.. టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించింది. 2017 పే స్కేల్ 21% శాతం ఇచ్చింది. సంవత్సరానికి 412 కోట్లు భారం పడుతుంది. పిఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న 1039 కోట్లు చెల్లించాం..



నెలవారీ PF కంట్రిబ్యూషన్ జనవరి–2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లించబడుతుంది.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు 345 కోట్లు రూపాయలు చెల్లించాం.. నెలవారీ సీసీఎస్ కంట్రిబ్యూషన్ జనవరి–2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లించబడుతుంది.. 1500 మంది కారుణ్య నియామకాలు చేపట్టినం.. ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేయడానికి అనుమతి ఇచ్చింది.. కొత్త బస్సులు కొనుగోలు చేశాం, తార్నాక ఆసుపత్రి ని సూపర్ స్పెషాలిటీ గా మార్చామని తెలిపారు.

## వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రం ప్రత్యేక కృషి..

నిజామాబాద్ : వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తూ ప్రోత్సాహకాలను అందజేస్తుందని ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. ప్రతి పంటపై నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రైతులు అవగాహన కలిగి ఉన్నా రని, దేశంలోనే నిజామాబాద్ ప్రాంతంలో ప్రగతిశీల రైతులున్నారని ఎంపీ తెలిపారు. హిందూ రాష్ట్ర స్థాపనకు ఇందూర్ నుంచి పునాది వేయబడిందన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో జెఎంకెపిఎం రైతు పసుపు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన పసుపు ఆధారిత పరిశ్రమ బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి లోక్‌సభ ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ, ఐఏఎస్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ ధర్మపురి పసుపు ఆధారిత పరిశ్రమను ప్రారంభించారు. అనంతరం జయశ్రీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై ప్రధాని మోడీ నాయకత్వంలో టెర్రరిజాన్ని పూర్తి స్థాయిలో అంత మొందించడానికి మోడీ ధీటైన జవాబు ఇవ్వనున్నారన్నారు. మోడీజీ భారతదేశ్ కా సడక్ బనానేలియే.. నహి అయే భారతదేశ కో జగద్గురు స్థాన్ మే ఖడా ఖాడానే లియే అయే అని ఎంపీ తెలిపారు. ప్రధానిగా నరేంద్ర మోడీ ఉండడం ప్రతి ఒక్క భారతీయుడి అదృష్టమన్నారు. 2019లో ఎంపీగా పోటీచేసిన సందర్భంలో 178 మంది రైతులు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచి సుమారు 94వేల ఓట్లు రైతులకు వచ్చాయి. కానీ 72వేల ఓట్లతో ఎంపీగా గెలిచానన్నారు. నా పార్టీకి గాని, వ్యక్తిగతంగా కానీ, ప్రధాని మోడీకి నేను చేయాల్సింది ఒకటే ఆ 94వేల ఓట్లు బీజేపీ పార్టీకి వచ్చేలా పనిచేస్తానని ఎంపీ తెలిపారు. రేవంత్, కవిత ఒక కంపెనీలో డైరెక్టర్లుగా పనిచేశార ని తెలిపారు. రేవంత్ రెడ్డి, కవిత



ఇద్దరూ ఒకటేనని ఎంపీ తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ముందుకు వస్తే సబ్సిడీలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. కో ఆపరేటివ్ సెక్టార్ లో ఏర్పడే పరిశ్రమలకు ఇందూరు ప్రాంతం ఎంతో అనుకూలమని ఎంపీ చెప్పారు.

తెలంగాణలోని పాకిస్తానీయులను వెంటనే పంపించాలి..

తెలంగాణలో ఉన్న పాకిస్తానీయులను వెంటనే పంపించేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. తెలంగాణాలో పాకిస్తానీయులు ఒక్కరు కూడా ఉండొద్దన్నారు. బోధన్ ప్రాంతమంతా రోహింగ్యాలకు అడ్డాగా మారిందనీ ఎంపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బోధన్ ప్రాంతంలో ఒకటే ఇంటిపై సుమారు 40కు పైగా దొంగ పాస్ పోర్ట్ లు దొరికిన సంఘటనను ఎంపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వచ్చే 2029 ఎన్నికల్లో ఇందూరు సెగ్మెంట్ లో బీజేపీకి 70శాతం ఓట్లు వస్తాయనీ ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల ప్రాణాలు అంటే మీకు లెక్క లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు, పసుపు రైతులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల నెక్ట్స్ టార్గెట్ జైళ్లు .. హెచ్చరించిన నిఘా వర్గాలు




న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడి తరువాత జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. ఉగ్రదాడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన నిఘా వర్గాలు తాజాగా ఉగ్రవాదులు మరోసారి దాడులకు పాల్పడవచ్చని హెచ్చరికలు జారీ చేశాయి. అయితే ఈసారి భద్రతా దళాలు, పర్యాటకులు, సామాన్య ప్రజల టార్గెట్‌గా కాకుండా.. జైళ్లలో ఉన్న ఉగ్రవాదులు టార్గెట్‌గా దాడులు జరగవచ్చని హెచ్చరికలు జారీ చేశారు.జమ్మూకాశ్మీర్‌లోని పలహ్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి యావత్ భారత దేశాన్ని కలిచి వేసింది. పచ్చని ప్రకృతిని ఆస్వాధించేందుకు వెళ్లిన సుమారు 28 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు. మతాన్ని అడిగి మరీ ఒక్కొక్కరి దారుణంగా కాల్చి చంపారు. ఈ ఉగ్రదాడి తరువాత జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. భారత్–పాకిస్తాన్ సరిహద్దులో నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైనికులు జరుపుతున్న కాల్పులను భారత్ సైన్యం సమర్థవంతంగా తిప్పి కొడుతోంది. మరోవైపు ఉగ్రదాడిపై దర్యాప్తును ముమ్మరం చేసిన నిఘా వర్గాలు కీలక విషయాలను రాబడుతున్నారు. తాజాగా ఉగ్రవాదులు మరోసారి దాడులకు పాల్పడవచ్చని హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఈసారి భద్రతా దళాలు, పర్యాటకులు, సామాన్య ప్రజల టార్గెట్‌గా కాకుండా.. జైళ్లలో ఉన్న ఉగ్రవాదులు టార్గెట్‌గా దాడులు జరగవచ్చని హెచ్చరికలు జారీ చేశారు.శ్రీనగర్ సెంట్రల్ జైలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి జైళ్లపై ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో జైళ్ల భద్రతను మరింత పటిష్ఠం చేసింది సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ . ప్రస్తుతం జమ్ముకశ్మీర్ జైళ్లలో హై–ప్రొఫైల్ ఉగ్రవాదులు, ఓవర్ గ్రౌండ్ వర్కర్లు , ఉగ్ర సంస్థల స్లీపర్ సెల్ సభ్యులు ఉన్నారు. ఓవర్ గ్రౌండ్ వర్కర్లు ఉగ్రవాదులకు లాజిస్టికల్ సహాయం, ఆశ్రయం, రవాణాకి సాయం చేస్తూ వివిధ కేసుల్లో అరెస్ట్ అయ్యారు. వారి ద్వారా తమ సమాచారం బయటకు వస్తుందన్న కోణంలో ఉగ్రవాదులు జైళ్లను టార్గెట్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి.

## పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులకు పాకిస్తాన్‌లో సైనిక శిక్షణ

జమ్ము కశ్మీర్: మినీ స్విట్జర్లాండ్”గా పిలువబడే బైసారన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఒక నేపాలీ జాతీయుడితో సహా ఇరవై ఆరు మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనకు పాల్పడిన టెర్రరిస్టులను పట్టుకునేందుకు భారత భద్రతా దళాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ ఘోరమైన కాల్పులకు పాల్పిన ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఉన్నత సైనిక శిక్షణ పొందారని నిఘా వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి ఈ శిక్షణ వారు జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొనింది. ఇప్పటికే జైలులో ఉన్న కొంతమంది ఉగ్రవాదులను విచారించినప్పుడు ఈ సమాచారాన్ని బయట పెట్టారని అధికారులు తెలిపారు.కాగా, పహల్గామ్ దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదులలో ఒకరైన హాషీమ్ ముసా గతంలో పాకిస్తాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్‌లో పారా–కమాండోగా పని చేశాడు. తరువాత అతను లష్కరే తోయిబాలో చేరాడు. ఇక, అప్పటి నుంచి అనేక ఉగ్రవాద దాడులకు పాల్పడుతున్నాడు. అయితే, 2023లో భారతదేశంలోకి ప్రవేశించినట్లు తెలిసింది.. అప్పటి నుంచి అతను జమ్మూ కాశ్మీర్ అంతటా జరిగిన ఆరు ఉగ్రవాద దాడుల్లో పాల్గొన్నట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్లో గండేర్బల్ జిల్లాలో జరిగిన దాడిలో ఏడుగురు, బారాముల్లాలో జరిగిన దాడిలో నలుగురు భద్రతా సిబ్బంది మరణించారు. అయితే, దక్షిణ



కాశ్మీర్ అడవుల్లో హాషీమ్ మూసా ఎక్కడో దాక్కున్నాడని భారత భద్రతా సంస్థలు భావిస్తున్నాయి. అతడ్ని పట్టుకోవడానికి పూర్తి స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఆ ఉగ్రవాది గురించి ఏదైనా సమాచారం ఇచ్చిన వారికి జమ్మూ కాశ్మీర్ పోలీసులు రూ. 20 లక్షల బహుమతిని ప్రకటించారు. అలాగే, సమాచారం ఇచ్చేవారి గుర్తింపును గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. పాకిస్తాన్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన ముసాతో సహా అందరు ఉగ్రవాదులు లష్కరే తోయిబా, జైషే మహ్మద్ లేదా హిజ్బుల్ ముజాహిదీన్‌లలో ప్రస్తుతం పని చేస్తున్నట్లు సమాచారం.

## రాజీవ్ యువ వికాసం కింద లబ్ధిదారుల ఎంపిక...



హైదరాబాద్,మే5: రాజీవ్ యువవికాసం కింద అందించే రుణాలను జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెలాఖరుకు లబ్దిదారుల జాబితాను అంటే అర్హుల జాబితాను సిద్దం చేస్తున్నారు. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ బాగుండాలి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో రుణం పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణాల దరఖాస్తులకు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666, ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీ–ల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా మే నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు.

### నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వెల్దండ మే 5: వడగళ్ల వానతో పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంట నష్టం అంచనా వేయాలని బీఆర్ఎస్ నాయకుడు పురుగుల లాలయ్య డిమాండ్ చేశారు.

## కెనడా నుంచి హిందువులను పంపించేయండి..



కెనడా: కెనడా దేశంలో ఖలిస్థానీలు రెచ్చిపోతున్నారు. తాజాగా ఆ దేశం నుంచి 8 లక్షల మంది హిందువులను వెనక్కి పంపించాలంటూ వేర్పాటు వాదులు టొరొంటోలోని మాల్టన్ గురుద్వారాలో ఓ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాళ్లు భారత ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి జై శంకర్ బొమ్మలను అభ్యంతరకర రీతిలో ఓ పంజరంలో పెట్టారు. అయితే, ఇటీవల ఖలిస్థానీ మద్దతుదారులు ఓ మందిరంలో విధ్వంసం సృష్టించారు. ఆ తర్వాత ఈ కార్యక్రమం జరిగింది. కెనడాలోని హిందూ సమాజానికి చెందిన ఓ నాయకుడు షవన్ బిందా ఈ వీడియోను ఎక్స్ (ట్విట్టర్) లో పోస్టు చేశారు. ఇది భారత ప్రభుత్వంపై చేస్తున్న ఆందోళన కాదు.. ఖలిస్థానీ గ్రూపునకు ఉన్న హిందూ వ్యతిరేకత అని పేర్కొన్నారు. కెనడాలో జరిగిన అతి భయంకరమైన దాడికి ఈ గ్రూపే కారణమని రాసుకొచ్చారు. కనిష్కా బాంబింగ్ ఘటనను గుర్తు చేస్తూ అతడు ఈ వ్యాఖ్యలు చేశారు.కాగా, కెనడాకు చెందిన విలేకరి డానియల్ బోర్డమన్ కూడా హిందూ వ్యతిరేకతను రెచ్చగొడుతూ ఖలిస్థానీలు నిర్వహించిన కార్యక్రమం వీడియోను నెట్టింట షేర్ చేశారు. అంతేకాదు ఖలిస్థానీలపై చర్యలు తీసుకోవడంలో కొత్త ప్రధాని మార్క్ కార్నీకి.. మాజీ ప్రధాని ట్రూడోకు ఏమైనా తేడా ఉందా అని క్వశ్చన్ చేశారు. ఖలిస్థానీలు భారత్ కు చెందిన కేంద్ర మంత్రులను బెదిరించడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల రైల్వేశాఖ సహాయమంత్రి రవనీత్ సింగ్ బిట్టూను హత్య చేయడానికి కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ విషయాన్ని స్వయంగా అతడే వెల్లడించారు. సోషల్ మీడియాలో లీకైన కొన్ని స్క్రీన్ షాట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపాడు. కేంద్ర మంత్రి అమిత్‌షాపై కూడా ఖలిస్థానీ సంస్థ వారిస్ పంజాబ్‌దే నాయకులు కక్ష పెంచుకొన్నట్లు చెప్పుకొచ్చాడు.

అగ్రనేత



## సంపాదకీయం

మంగళవారం 06-05-2025

# చివరకు కులగణన వైపే మొగ్గు

కులగణన ప్రతిపాదనపై గత కొన్నేళ్లుగా కారాలూ మిరియాలూ నూరుతూ వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎట్టకేలకు తన వైఖరి మార్చుకుంది. వచ్చే జనగణనతోపాటే కులగణన కూడా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ బుధవారం నిర్ణయించటం దేశ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. అయితే ఇప్పటికే అయిదేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న జనగణన ఎప్పుడు ప్రారంభిస్తారన్న అంశంలో స్పష్టత లేదు. స్వాతంత్ర్యానంతరం అణగారిన కులాలు సైతం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటం వంటి పరిణామాల కారణంగా ఆ వర్గాల్లో చైతన్యం పెరిగింది. జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటం లేదన్న అసంతృప్తి ఎక్కువైంది. అందుకే కులగణన జరపాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. దేశంలో దీన్ని మొట్టమొదట స్వాగతించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2021లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కులగణన జరపాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి పంపింది. 2024 జనవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగవంతంగా, శాస్త్రీయంగా కులగణన నిర్వహించారు. బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు సైతం కులగణన చేశాయి. అయితే బీజేపీ మొదటినుంచీ ఈ డిమాండును వ్యతిరేకించింది. 2021 జులై 20 నాడు పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చిన ఆనాటి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ 'జనగణనలో ఎప్పటిలా ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా లెక్కల సేకరణ మినహా ఇతర కులాల లెక్కింపు జరపరాదన్నది కేంద్రప్రభుత్వ విధానపరమైన నిర్ణయం' అని ప్రకటించారు. బయట ఎక్కడా నేరుగా కులగణనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు ప్రకటనలు చేయకపోయినా, సమాజాన్ని విచ్ఛిన్నం చేయటానికి కాంగ్రెస్ కులాన్ని ఉపయోగించుకుంటున్నదని విమర్శించేవారు. మొన్నటికి మొన్న పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నావికాదళ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను మతం ఏమిటో కనుక్కుని కాల్చిచంపటాన్ని ప్రస్తావించి 'వారడిగింది మతం... కులంకాదు' అని ఛత్తీస్‌గఢ్ బీజేపీ ట్వీట్ చేసింది. అయితే కులగణన చేయటమే సరైందని ఆరెస్సెస్ భావిస్తున్నదని రెండు నెలల క్రితం ఒక ఆంగ్లపత్రిక వెల్లడించినప్పటినుంచీ దీనిపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవచ్చన్న అంచనాలు మొదలయ్యాయి. జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా జరిగితే దేశంలో దాదాపు వందేళ్ల తర్వాత ఆ ప్రక్రియ మళ్లీ అమల్లోకొచ్చినట్టవుతుంది. ఆఖరుసారి వలస పాలకుల హయాంలో 1931లో కులాలవారీ జనాభా లెక్కేశారు. అప్పట్లో 4,147 కులాలున్నట్టు తేల్చారు. 1901లో ఈ సంఖ్య 1,646. తర్వాత 1941లో కూడా కొంతవరకూ జనాభా లెక్కల్లో కులాన్ని గణించారుగానీ రెండో ప్రపంచయుద్ధ కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. పీపుల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు 1992లో జరిపిన ఒక సర్వే ప్రకారం దేశంలో 4,635 కులాలున్నాయి. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణన నిర్వహిస్తామని వాగ్దానం చేశారు. అనంతరం సాంఘికార్థిక సర్వేకింద 2011-12 మధ్య ఆ లెక్కలు తీశారు. కానీ ఆ డేటాను బయటపెట్టలేదు. ఇటీవల జనగణనపై కాంగ్రెస్ పట్టుబట్టడం మొదలైంది. మతంపై ప్రధానంగా కేంద్రీకరించే బీజేపీ ఇందుకు ససేమిరా సమ్మతించబోదని, అందువల్ల ఎన్నికల్లో కులగణన తనకు ప్రధాన ఆయుధంగా మారుతుందని ఆ పార్టీ భావించింది. కానీ బీజేపీ హఠాత్తుగా మనసు మార్చుకోవటంతో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నినాదం లేకుండా పోయింది. అణగారిన కులాలు అడిగాయని కాదు... కులం ఒక వాస్తవం అయినప్పుడూ, సమాజంపై దాని ప్రభావం అమితంగా వున్నప్పుడూ ఎవరి సంఖ్య ఎంతో తేల్చటం ప్రభుత్వాల బాధ్యత. ఇన్నాళ్లూ దాన్ని విస్మరించారు. ఇందువల్ల రెండు రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమ ఫలాలు లక్షిత వర్గాలకు సరిగా చేరటం లేదు. ఇప్పటికీ విద్యాగంధం అంటని, ప్రభుత్వ పథకాల సంగతే తెలియని కులాలవారు గణనీయంగావున్నారు. ఫలితంగా బడ్జెట్‌లలో గర్వంగా ప్రకటించుకునే పథకాలు ఆచరణలో నిరుపయోగం అవుతున్నాయి. ఇక ఇంద్ర సాహ్నీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు నిర్ణయం కోటా పెంపు ప్రయత్నాలకు అవరోధమవుతోంది. సమస్య వుందని ప్రభుత్వాలకు తెలిసినా, కొత్తగా తెరపైకొస్తున్న కులాలకు న్యాయం చేద్దామనుకున్నా అసాధ్యమవుతున్నది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్య కులాల హవా కొనసాగుతోంది. సమయానుకూల నిర్ణయాలు తీసుకోవటంలో, గాలివాలుకు అనుగుణంగా దూసుకెళ్లటంలో బీజేపీ దరిదాపుల్లోకొచ్చే రాజకీయపక్షం మరొకటి లేదు. వాస్తవానికి గత లోక్‌సభ ఎన్నికల ముందూ... మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భాల్లో కులగణనపై కేంద్రం నిర్ణయం ప్రకటిస్తుందని అందరూ భావించారు. అలాచేస్తే కాంగ్రెస్ డిమాండుకు తలొగ్గినట్టయ్యేది. పహల్‌గామ్ మారణకాండపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నవేళ కులగణన నిర్ణయం తీసుకోవటంతో అది తన ఘనతేనని కాంగ్రెస్ చెప్పుకునే పరిస్థితి లేకుండాపోయింది. పైగా కేంద్రంలో ఎక్కువకాలం అధికారంలోవున్నా కులగణన జోలికి పోకపోవటం... 2011%-%12లో ఆ పని చేసినా దాన్ని సామాజికార్థిక సర్వేగా చెప్పటం ఆ పార్టీకి పెద్ద మైనస్. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకున్నా తాజా నిర్ణయం నిస్సందేహంగా బీజేపీకి ఉపకరిస్తుంది. అయితే దీని వెంబడి రాగల ఇతరేతర డిమాండ్లతో ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుందన్నది చూడాలి.

# కులగణన.. ఆవశ్యకత,సవాళ్లు

న్యూఢిల్లీ,భారత దేశంలో కులగణన ఎప్పుడూ ఒక వేడి చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత దేశంలో అన్ని కులాల సమగ్ర గణన జరగలేదు. 1951 నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కలలో కేవలం షెడ్యూల్డ్ కులాలు, తెగల గణాంకాలను మాత్రమే సేకరించి ప్రచురించారు. ఇతర కులాల సమగ్ర గణన ఇప్పటి వరకు జరగలేదు. అయితే 2011లో సామాజిక, –ఆర్థిక కులగణన జరిగింది కానీ దాని ఫలితాలు ఇంకా అధికారికంగా విడుదల కాలేదు. ఇప్పుడు 2025లో జరగబోయే జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కులగణన ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. ఇది ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం పాత జనాభా అంచనాలపై ఆధారపడి ఉంది. కులగణన ద్వారా ప్రతి కులం ఖచ్చితమైన జనాభా సంఖ్య తెలుస్తుంది. ఈ సమాచారం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని మరింత సమర్థవంతంగా, న్యాయంగా పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది. ఏయే కులాలకు ఎంత ప్రాతినిధ్యం అవసరమో గుర్తించి ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అసమానతలను తగ్గించవచ్చు. అంతేకాకుండా కులగణన వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం ప్రతి కులం ప్రత్యేక అవసరాలను గుర్తించి వారికి లక్షిత అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించవచ్చు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన కులాలను గుర్తించడం సులభమవుతుంది. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది. కులగణన వెనుకబడిన కులాల వాస్తవ పరిస్థితిని సమాజానికి తెలియజేస్తుంది. ఇది సమాజంలో వారి స్థానాన్ని మెరుగుపరచడానికి, వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి, వారి సాధికారతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒక బలమైన పునాదిని అందిస్తుంది. చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు. వనరుల కేటాయింపులో కూడా కులగణన కీలకపాత్ర పోషిస్తుంది. వివిధ కులాల జనాభా నిష్పత్తి, వారి అవసరాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాలకు నిధులను మరింత సమర్థవంతంగా కేటాయించగలదు. ఇది ప్రాంతీయంగా కులాల వారీగా ఉన్న అభివృద్ధి అంతరాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కులగణన డేటా సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, ఇతర పరిశోధకులకు కుల వ్యవస్థ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడానికి, వివక్ష మూలాలను గుర్తించడానికి సమర్థవంతమైన పరిష్కారాలను సూచించడానికి, ఒక విలువైన వనరుగా ఉపయోగపడుతుంది. ఇది విధాన రూపకర్తలకు ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. భారత దేశం విశాల జనాభా, భౌగోళిక వైవిధ్యం కారణంగా సమగ్రమైన కులగణన నిర్వహించడం ఒక పెద్ద సవాలు. దేశంలో వేల సంఖ్యలో కులాలు, ఉపకులాలు ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా వర్గీకరించడం ఒక పెద్ద సమస్య. ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సామాజిక స్థానాలు కలిగిన కులాలు ఉండవచ్చు. దీనికి స్పష్టమైన, ప్రామాణికమైన వర్గీకరణ మార్గదర్శకాలను అభివృద్ధి చేయడం అవసరం. భాషా, ప్రాంతీయ వైవిధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైతే సాంకేతికతను ఉపయోగించి డేటాను విశ్లేషించాలి, నిపుణుల సలహాలు తీసుకోవాలి. కాలక్రమేణా వ్యక్తులు, సమూహాలు తమ కుల గుర్తింపును మార్చుకునే అవకాశం



ఉంది. రిజర్వేషన్ల కోసం లేదా సామాజిక ఉన్నతి కోసం ఇలా జరగవచ్చు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రజల నుండి నేరుగా వారి కుల వివరాలను అడగడం, స్వీయ గుర్తింపును ప్రామాణికంగా తీసుకోవడం ఉత్తమం. డేటా సేకరణలో పక్షపాతం కూడా ఒక ముఖ్యమైన సవాలు. గణన సిబ్బంది వారి వ్యక్తిగత నమ్మకాలు లేదా అంచనాల ఆధారంగా తప్పుగా డేటా నమోదు చేసే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి సిబ్బందికి కులం సున్నితత్వాన్ని ఖచ్చితమైన డేటా సేకరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సమగ్రమైన శిక్షణ ఇవ్వాలి. పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి, యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలి. కులగణన రాజకీయంగా సున్నితమైన అంశం కాబట్టి తప్పుడు సమా చారం ఇవ్వడానికి లేదా డేటాను తారుమారు చేయడానికి ఒత్తిడులు ఉండవచ్చు. డేటా సేకరణ ప్రక్రియను పారదర్శకంగా ఉంచడం, డేటా భద్రత గోప్యతను నిర్ధారించడం చాలా ముఖ్యం. రాజకీయ జోక్యాన్ని నివారించడానికి స్వతంత్ర సంస్థల పర్యవేక్షణను ఏర్పాటు చేయాలి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీనిని అధిగమించడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, దశలవారీగా గణన నిర్వహించడం, వనరులను తెలివిగా కేటాయించడం అవసరం. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కూడా ముఖ్యమైనది. కులగణన ఉద్దేశం, దాని సంభావ్య ఉపయోగాల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు తప్పుడు సమాచారం ఇవ్వవచ్చు లేదా సహకరించకపోవచ్చు. దీనిని అధిగమించడానికి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. మీడియా ప్రజా నాయకుల సహకారం తీసుకోవడం కూడా ఉపయోగపడుతుంది. చివరగా సేకరించిన కులాల డేటా గోప్యత, భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. డేటా లీక్ కావడం లేదా దుర్వినియోగం కావడం జరిగితే తీవ్రమైన పరిణామాలు ఉండవచ్చు. డేటా నిల్వ, నిర్వహణ కోసం కఠినమైన భద్రతా ప్రోటో కాల్‌లను అనుసరించాలి అధునాతన సాంకేతికతలను ఉపయోగించాలి. కులగణన సఫలం కావాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. స్పష్టమైన లక్ష్యాలు, పరిధిని నిర్దేశించడం, సమగ్రమైన ప్రణాళిక వ్యూహం రూపొందించడం, ఖచ్చితమైన వర్గీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, పారదర్శకత పాటించడం, డేటా గోప్యతను నిర్ధారించడం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం, నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం, క్రమానుగత పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కులగణన మరింత విజయవంతం కాగలదు. సామాజిక న్యాయం సమానత్వం సాధనలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# కర్రెగుట్టల 'అంచున' యుద్ధమా.. శాంతా?



హైదరాబాద్,దేశంలో మావోయిస్టులకు ప్రభుత్వాలకు మధ్య దశాబ్దాలుగా సాగుతున్న ఘర్షణ ఇటీవల ఒక కొత్త మలుపు తిరిగింది. ఈ మలుపు 2014లో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా, అమిత్ షా హోం మంత్రిగా పరిపాలన ప్రారంభించిన దగ్గర నుంచే చూస్తున్నాం. ఇందుకు తాజా ఉదాహరణగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పరిధిలోని కర్రెగుట్టల ప్రాంతంలో కేంద్ర బలగాలు పొరుగు రాష్ట్రమైన చత్తీస్‌గఢ్ పోలీసుల సహకారంతో సాగిస్తున్న వేటను చెప్పుకోవచ్చు. దాదాపు రెండు వారాలుగా కర్రెగుట్టల ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ (అంచున) సాగుతూ ఉన్నది. భౌగోళికంగా చూసినట్టయితే కర్రెగుట్టలు చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్నాయి. ఇక్కడ వరుసగా దాదాపు 20 నుండి 30 వరకు గుట్టలున్నట్టు అంచనా. ఈ గుట్టల మీద మావోయిస్టులు కొన్ని దశాబ్దాలుగా గుహలు, సొరంగాలు ఏర్పరచుకొని బలమైన షెల్టర్లుగా వాడుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున బాంబులు ప్రయోగించడం, డ్రోన్లు ఉపయోగించడం ఇతరత్రా సాంకేతికంగా, ఆధునికంగా చేతికందిన అన్ని మార్గాలనూ కేంద్ర బలగాలు ఉపయోగిస్తున్నాయి. ఒక విశేషమేమిటంటే కర్రెగుట్టల చుట్టూ ఉన్న తెలంగాణ ప్రాంతంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వైపు గాని, అటు చత్తీస్‌గఢ్ ప్రాంతంలోని సుకుమా, బీజాపూర్ జిల్లాల వైపు గాని దరిదాపుల్లోకి కూడా కేంద్ర బలగాలు మీడియాను అనుమతించకపోవడంతో మీడియా పెద్ద ఎత్తున తనకు తోచిన కథనాలు రాయడం, ప్రసారం చేయడం వల్ల తీవ్ర గందరగోళం ఏర్పడింది. జరుగుతున్నది ప్రత్యక్షంగా చూసే వీలు లేని కారణంగా సత్యాలు రాసే, ప్రసారం చేసే అవకాశం లేకపోవడంతో బాటు, మావోయిస్టు పార్టీ పేరిట ఎవరో విడుదల చేసిన నకిలీ పత్రికా ప్రకటన ప్రచారం, ప్రసారం చేసి ప్రజలకు అసత్యం అందించి మీడియా నాలుక కరుచుకునే పరిస్థితి. ఎన్నో ఏళ్ళుగా తమకు రహస్య స్థావరాలుగా ఉన్న కర్రెగుట్టల మీద తాము ఉన్నామనే అర్థం వొచ్చే విధంగా పత్రికా ప్రకటన ఇచ్చి దాని ఉనికి మావోయిస్టు పార్టీ ఎందుకు బహిర్గతం చేసుకుంటుంది అన్న ఆలోచన మీడియా వారికి రాకపోవడం ఆశ్చర్యం. తరువాత ఒకటి రెండు రోజుల్లోనే మావోయిస్టు పార్టీ ఆ ప్రకటన తాము విడుదల చెయ్యలేదనీ, అది పోలీసులు సృష్టించిన నకిలీ ప్రకటన అని స్పష్టం కూడా చేసింది. ఇది మీడియా దృష్టికి పెద్దగా వచ్చినట్టు లేదు. ఒకటి రెండు మినహాయింపులు ఉంటే ఉండొచ్చు. కర్రెగుట్టల మీద కేంద్ర బలగాలు జరిపిన ఈ ఆపరేషన్ కగార్‌లో ముగ్గురు మహిళలు చనిపోయారు. వాళ్ళు మావోయిస్టు పార్టీకి చెందినవారని పోలీసులు, కాదు అమాయక ఆదివాసీ మహిళలని మావోయిస్టులు అంటున్నారు. దాదాపు పది రోజుల తర్వాత కేంద్ర బలగాలు కర్రెగుట్టల మీద జాతీయ జెండా ఎగరేసి ఏదో శత్రురాజ్యం మీద యుద్ధం గెలిచి అక్కడి మన భూభాగాన్ని ఆక్రమించుకున్నట్టుగా హడావిడి చేసాయి. కర్రెగుట్టలు కేంద్ర బలగాల స్వాధీనం కావడం మామూలు విషయమేమీ కాదు. చాలా కాలంగా అవి మావోయిస్టులకు పెద్ద ఎత్తున ఆశ్రయంగా ఉపయోగపడుతూ వచ్చినవి అనే విషయం ఇంతకు ముందే మాట్లాడుకున్నాం. అయితే కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన అయిపోలేదు. దాని వరుస వెంబడే 20 నుండి 30 వరకు గుట్టలు ఉన్నాయని చెప్తున్నారు. ఎక్కడెక్కడ ఏమున్నాయో రాష్ట్రాల పోలీసు బలగాలకే తెలియని స్థితి. కర్రెగుట్ట, దుర్గం గుట్ట, దోబికొండ, నీలం సారాయి వంటి కొన్ని గుట్టలను ఇప్పటికైతే గుర్తించారు. మొత్తం అన్నిటినీ గుర్తించి పర్యవేక్షించడానికి, మావోయిస్టుల ఆచూకీ తెలుసుకోవడానికి సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్ ఒకటి కర్రెగుట్టల దగ్గర ఏర్పాటు చేశారు. ఇప్పటికే చత్తీస్‌గఢ్ ప్రాంతంలో భారీ ఎత్తున ప్రాణనష్టం చూసిన మావోయిస్టుల కదలికలు కేంద్ర ప్రభుత్వ ఈ చర్యతో ఇబ్బందికరంగా మారతాయనడంలో సందేహం లేదు. వేరు వేరు పేర్లతో అయినా దేశంలో కొన్ని రాష్ట్రాల్లో, అందునా దక్షిణాదిన నక్సలైట్ ఉద్యమం అర్థశతాబ్దంగా ఆటుపోట్లను తట్టుకుంటూ, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సాగిన క్రమంలో ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడు రాష్ట్రాల శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యగానే చూస్తూ ఉండేది. నక్సలైట్ ఉద్యమం బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తరచూ కేంద్రానికి నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కోవడం కోసం, దాన్ని అణిచివేయడం కోసం అదనపు బలగాలు కావాలని, అదనపు నిధులు కేటాయించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేయడం చూసాం. కేంద్ర ప్రభుత్వం, అది ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఈ విజ్ఞప్తిని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు చాలా కాలం లేవు. చాలా కొద్ది సందర్భాల్లో కేంద్రం ఈ విజ్ఞప్తుల్ని అరకొరగా అంగీకరించి సాయం చేసిన విషయం కూడా తెలిసిందే. గత పది పదకొండు సంవత్సరాల కాలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల మీద యుద్ధం ప్రకటించింది. ఈ మాటే ఎందుకనాల్సి వస్తున్నదంటే సాక్షాత్తు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలుమార్లు లోక్‌సభ వేదికగా ఫలానా తేదీలోగా నక్సలైట్ ఉద్యమాన్ని తుదముట్టిస్తామని ప్రకటనలు చేశారు. తాజాగా ఆయన ఇటీవలే లోక్‌సభలో 2026 మార్చి నెల నాటికి మొత్తం నక్సలైట్ ఉద్యమం తుడిచిపెట్టుకుపోతుందని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ఆపరేషన్ కగార్ పేరిట నక్సలైట్ ఉద్యమాన్ని అంతమొందించేందుకు రాష్ట్రాల ప్రమేయం లేకుండా కేంద్ర బలగాలని దింపి దాడులకు ఉపక్రమించింది. ప్రధానంగా మావోయిస్టు ఉద్యమం బలంగా ఉన్న చత్తీస్‌గఢ్, దానికి ఆనుకొని ఉన్న తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో కేంద్ర బలగాలు విస్తృతంగా దాడులు జరిపి అనేక మందిని తుద ముట్టించాయి. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం 2025 మొదటి మూడు మాసాల్లోనే 140 మందికి పైగా మావోయిస్టులు చత్తీస్‌గఢ్‌లోనే భద్రతా దళాల చేతుల్లో హతమయ్యారు. వీరందరూ మావోయిస్టులని కేంద్ర ప్రభుత్వం లేదు ఇందులో అమాయకపు ఆదివాసీలు కూడా ఉన్నారని మావోయిస్టు ఉద్యమం వాదిస్తున్నాయి. అయితే ఇందులో మావోయిస్టు ముఖ్యులు కూడా కొందరు మరణించారు. 2024లో అయితే మొత్తం 235 మంది మరణించారు. కొన్ని సందర్భాలలో కేంద్ర భద్రత బలగాలకు సంబంధించిన వారు కూడా మావోయిస్టుల దాడిలో చనిపోయారు. ఇదిలా ఉంటే కర్రెగుట్టలలో కగార్ మొదలుకాక ముందే మావో యిస్టులు ప్రభుత్వంతో చర్చలకు రావడానికి తాము సిద్ధంగా ఉన్నామని ముందుకొచ్చారు.

# బెంగళూరులో ట్రాఫిక్ చిక్కులకు చెక్

బెంగళూరు,ఐటీ– పరిశ్రమ విస్తరణతో ఇండియన్ సిలికాన్ వ్యాలీగా గుర్తింపు తెచ్చుకున్న బెంగళూరులోని –టె–క్కీలను చాలా కాలంగా పీడిస్తున్న ట్రాఫిక్ విషయంలో శుభవార్త చెప్పింది. సరైన మెట్రో కనెక్టివిటీ లేకపోవటం కూడా చాలా మంది సొంత వాహనాలపై వెళ్లాల్సిన పరిస్థితిని కల్పిస్తోంది. అయితే ప్రస్తుతం బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్కీలకు ఒక శుభవార్తను ప్రకటించింది. చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న మెట్రో ఎల్లో లైన్ మే 15 నుంచి అందుబాటులోకి రానున్నట్లు– నమ్మ మెట్రో వెల్లడించింది. ఈ రూటు– ఆర్వీ రోడ్ నుంచి బొమ్మసంద్ర వరకు ప్రయాణికులు సులువు చేయనుంది. అలాగే ఎలక్ట్రానిక్ సిటీ– ప్రాంతంలో నివసించే లక్షల మంది ఐటీ ఉద్యోగులకు ఎల్లో లైన్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుంది. కొత్తగా మెట్రో ఎల్లో లైన్ రూటు– అందుబాటు–లోకి రావటం వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గటంతో పాటు– ఉద్యోగులకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విప్రో, ఇన్ఫోసిస్, హెచ్సీఎల్ వంటి దిగ్గజ –టె–క్ కంపెనీల ఆఫీసులు ఉన్న ఈ ప్రాంతంలో రద్దీ సమస్యలు తగ్గనున్నాయని అధికారులు చెబుతున్నారు. బొమ్మసంద్ర నుంచి ఎలక్ట్రానిక్ సిటీ–కి కేవలం 6 కిలోమీటర్ల దూరం ఉండటంతో మెట్రో కనెక్టివిటీ– ద్వారా కేవలం కొన్ని నిమిషాల ప్రయాణంతోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చని టెక్కీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 14న చైనాలో తయారైన 6 కోచెస్ బెంగళూరుకు చేరుకున్నాయి. త్వరలోనే ఇలాంటివి మరో ఆరింటిని తీసుకురానున్నట్లు– అధికారులు చెబుతున్నారు. ఈ రూట్ స్టార్ట్ అయితే ప్రయాణికులు ఇండస్ట్రియల్ హబ్, రెసిడెన్షియల్ హబ్ మధ్య ప్రయాణం సుగమం అవుతుందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

# కాంగ్రెస్‌పై భ్రమలు తొలగి పోయాయి

నిజామాబాద్,వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులు ఇవ్వడంలేదు. రుణమాఫీ సరిగా చేయలేదు. కనీస మద్దతు ధరకు పంటల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని శనివారం నాడిక్కడ తనను కలిసిన మీడియా మిత్రులతో అన్నారు. ఇందులో భాజపా పాత్ర కూడా ఉందని ఆరోపించారు. తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ పాలన ప్రమాదకరంగా మారిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అన్నదాతలకు బిఆర్ఎస్, కెసిఆర్ ఎప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ఏర్పాటు వల్ల రైతులు, వారి కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. ఒక్కకెసిఆర్ మాత్రమే రైతులకు మేలు చేయగలరని ప్రజలకు కూడా తెలిసిపోయిందని అన్నారు. రైతుల్ని ఆత్మగౌరవంతో బతికేలా చేయాల్సిన ప్రభుత్వం దాన్ని విస్మరించి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులను కల్పిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధార పడ్డారు. అది ప్రమాదం అంచున ఉంది. వ్యవసాయాన్ని కాపాడు కోవడం ద్వారా తెలంగాణ సమాజాన్ని కాపాడాలనే లక్ష్యంతో కెసిఆర్ అనేక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. రైతు ఆత్మగౌరవంతో బతికేందుకు కావాల్సిన అన్ని రకాల నిర్ణయాలు తీసుకున్నారు. రుణమాఫీ, గిట్టుబాటు ధర, పంటలకు బీమాపై బిఆర్ఎస్ అనేక చర్యలు తీసుకోగా ఇప్పుడు ప్రచారాలతో కాంగ్రెస్ కాలం గడుపుతోందని అన్నారు. పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తే రైతులు ఆత్మగౌరవంతో బతుకుతారని,కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని విస్మరించాయని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారి సమస్యలను బిఆర్ఎస్ మాత్రమే పరిష్కరిస్తుందిన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి వేలమంది రైతులు, విద్యార్థులు బలయ్యారని అన్నారు.

# అప్పులు తీర్చే స్థోమత లేక బలవన్మరణం

విశాఖపట్టణం,బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి.. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టి సంపాదిస్తామన్న ఆశతో వాటి మోజులో పడి.. ఉన్న డబ్బునంతా పోగొట్టు–కోవడమే కాదు.. అప్పులు చేసి మరి బెట్టింగ్‌లు పెట్టి.. చివరకు లక్షల్లో అప్పులు కావడం.. తీర్చే స్తోమత కూడా లేకుపోవడంతో.. ప్రాణాలు తీసుకుంటున్నారు ఎంతో మంది యువకులు.. తాజాగా, బెట్టింగ్ యాప్ లకు విశాఖపట్నంలో మరో యువకుడు బలి అయ్యాడు..ద్వారక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా లాడ్జిలో పనిచేస్తున్న పవన్ అనే యువకుడు.. బెట్టింగ్ కి బానిసగా మారిపోయాడు.. బెట్టింగ్‌తో డబ్బులు సంపాదించవచ్చు అనే ఆశతో.. ఉన్న డబ్బులు పెట్టడమే కాదు.. తన దగ్గర సొమ్ము అంతా అయిపోయిన తర్వాత.. అనేక చోట్ల అప్పులు చేసి మరీ బెట్టింగ్ వేశాడు.. అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఓవైపు.. బెట్టింగ్‌లో డబ్బులు అన్నీ పోవడం మరోవైపు.. తీవ్రమనస్తాపానికి గురైన పవన్.. చివరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డాడు.. కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు.. అయితే, బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టు–కుని అప్పులు పాలైన యువకుడు.. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు–గా పోలీసులు చెబుతున్నారు.. బెట్టింగ్ యాప్స్ జోలికి పోవద్దు.. మీ జీవితాన్ని, కుటు–ంబాన్ని నాశనం చేసుకోవద్దు.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు అని పోలీసులు సూచిస్తున్నారు.

# పత్తి కొనుగోళ్లలో రూ.3వేల కోట్ల కుంభకోణం

హైదరాబాద్,పత్తి కొనుగోళ్లలో రూ. 3వేల కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హస్తం ఉందని విమర్శించారు. రైతులు క్వింటాకు రూ. 2వేలు నష్టపోయారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం నాడు మీడియాతో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రైతు దగ్గర క్వింటాల్ పత్తిని రూ. 5వేలకు కొనుగోలు చేసి... బ్రోకర్లు రూ. 7 వేలకు పైగా దండుకున్నారని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్డితో విచారణ జరిపించాలని పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులు పత్తి రైతులను మోసం చేశారని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆలస్యం చేయటంతోనే.. రైతులు నష్టపోయారని చెప్పారు. కేవలం 20శాతం మంది రైతులే సీసీఐకు పంటను అమ్ముకున్నారని అన్నారు. మిగిలిన పంటను కాంగ్రెస్ నేతలు సిండికేట్‌గా ఏర్పడి.. సీసీఐకు అమ్ముకున్నారని ఆరోపణలు చేశారు. దీపావళి సందర్భంగా.. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సీసీఐ అధికారులు, ట్రేడర్ల మధ్య జరిగిన రహస్య సమావేశంలో ఈ కుంభకోణానికి బీజం పడిందని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణలు చేశారు.

# ఒత్తిడికి కేంద్రం లొంగేనా?

హైదరాబాద్, మధ్య భారతంలో ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, జారండ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు కేంద్రీకృతమై ఉన్నారు. వారి నిర్మూలనే లక్ష్యంగా గత కొద్దికాలంగా అప్రతిహతంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట సాయుధ చర్యలు కొనసాగిస్తున్నది. ఈ ఆపరేషన్‌పై తెలంగాణ వేదికగా రాజకీయ నిరసన గళాలు విచ్చుకుంటున్నాయి. రోజురోజుకు ఈ స్వరాలు పెరుగుతున్నాయి. నక్సలైట్ అనుకూల, వ్యతిరేక విధానాలను పక్కకు పెట్టి, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న రక్తపాతం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయుధ బలగాల దాడుల్లో అమాయక ఆదివాసీ యువత మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యుద్ధంలో ఇరువైపులా ప్రాణ నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ క్రమంగా పెరుగుతున్నది. కొన్ని నెలలుగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతంలో నిత్యం పదుల సంఖ్యలో మావోయిస్టులు మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే. ఇరువర్గాల మధ్య యుద్ధకాండలో సాయుధ బలగాల ప్రతినిధులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. మధ్యలో ఆదివాసీలు నలిగిపోతున్నారు. గిరిజన గూడాలు, పల్లెలు నిత్యం దాడులతో తల్లడిల్లిపోతున్నాయి.

మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా ముందుకు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్‌లో కొద్దికాలం క్రితం అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ పేరుతో దాడి కొనసాగిస్తున్నాయి. అటవీ ప్రాంతాలలో వేల సంఖ్యలో సాయిధబలగాలను మోహరించి, బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలపై ఉక్కు పాదాన్ని మోపుతున్నాయి. మావోయిస్టులకు కేంద్రంగా నిలిచిన అబూజ్ మాడ్ లాంటి కీలకమైన స్థావరంతోపాటు కర్రెగుట్టలను కూడా సాయిధ బలగాలు స్వాధీనం చేసుకొని బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి మావోయిస్టుల ఉనికి లేకుండా చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో గత ఏడాదిన్నర కాలంగా జరుగుతున్న యుద్ధంలో ఇప్పటికే 250 పైగా మావోయిస్టు పార్టీకి చెందిన ముఖ్యులు, ప్రధాన నాయకులు ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో మావోయిస్టు సాధారణ కార్యకర్తలు, సానుభూతిపరులు, కొందరు నాయకులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ వరుస ఎన్‌కౌంటర్లలో మరణించినవారిలో ఎక్కువమంది ఆదివాసీలు కావడం గమనార్హం. వచ్చేయేడాది మార్చి నెలాఖరు లక్ష్యంగా దేశంలో మావోయిస్టులనే వారు లేకుండా నిర్మూలిస్తామంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పదేపదే ప్రకటిస్తూ యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు.

స్పందించిన తెలంగాణ సమాజం

ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, మృతుల సంఖ్య, సాయుధ బలగాలు అటవీ ప్రాంతంలో సాగించిన ఆధిపత్యం, వేల సంఖ్యలో బలగాలు మావోయిస్టు స్థావరాలను చుట్టుముట్టి చేస్తున్న దాడులు తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణలోని పౌర సమాజం, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు తీవ్రంగా స్పందించాయి. శాంతి చర్చలకు ప్రతిపాదన చేస్తూ ఒక కమిటీ ఏర్పడింది. శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనకు మావోయిస్టు పార్టీ కూడా సానుకూలంగా స్పందించింది. దీంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నం సాగుతోంది. మరోవైపు దీనిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంటే బాగుంటుందని అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతున్నది. ఇలా ఉండగా శాంతి చర్చల కమిటీ ఏర్పడకం ముందు నుంచి సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, జనశక్తి, మాస్ లైన్, సీపీఎం, టీజెఎస్ లాంటి పార్టీలు ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

శాంతి చర్చల కమిటీతో ఎజెండాపైకి సమస్య

రాష్ట్రంలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటు తర్వాత ఈ విషయం మరింతగా చర్చల్లోకి వచ్చింది. తాజాగా కర్రెగుట్టలను వేల సంఖ్యలో సాయుధ బలగాలు చుట్టుముట్టడంతో భారీ ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అయింది. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో ప్రాణ నష్టం తప్పినప్పటికీ తెలంగాణ సమాజంలో విస్తృత చర్చకు దారితీసింది. ఇదే సమయంలో శాంతి చర్చల కమిటీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆదివారం సమావేశం కావడం, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంతో చర్చ మరింత పెరిగింది. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ కూడా కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేయడంతో గొంతులు మరింత పెరిగాయి. సోమవారం ఇదే విషయమై సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ మాజీ హోం మంత్రి జానారెడ్డి, కేశవరావులతో చర్చలు జరపడంతో ఈ అంశానికి మరింత ప్రాధాన్యత చేకూరింది. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు లేదా దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ అధికార బీజేపీపై ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఎవరి రాజకీయ అభిప్రాయాలు ఎలా ఉన్నప్పటికీ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుంటే మంచిదనే అభిప్రాయం తెలంగాణ సమాజంలో మరోసారి వ్యక్తం అవుతుంది.

# అవకతవకలపై కూపీ లాగనున్న ఏసీబి

హైదరాబాద్,కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అవకతవకల కేసులో చంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఈఎన్‌సి భూక్య హరిరామ్ ను ఏసీబీ అధికారులు ఐదు రోజులకస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు హరి రామ్‌ను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరి రామ్ కీలకంగా వ్యవహరించారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిసిన అనంతరం ఆయనను పోలీసులు జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. సుమారు రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు- ఏసీబీ అధికారులు గుర్తించారు. హరి రామ్ ఇంటితోపాటు- ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏక కాలంలో 14 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మర్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్‌ను గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలయం, హరిరామ్ బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.

# ఖనిజ ఒప్పందం ఎవరికి లాభం?



వాషింగ్టన్,ఉక్రెయిన్‌లోని అపారమైన, అరుదైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవాలనుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎట్టకేలకు పైచేయి సాధించారు. అపురూప ఖనిజాలపై చైనా ప్రాభవానికి బ్రేకు వేయాలని ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక, రక్షణ రంగాలకు అవసరమయ్యే కీలకమైన, అపురూప ఖనిజాల్లో ప్రపంచం మొత్తం మీద 90% వరకు చైనాయే ఉత్పత్తి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందంపై గత కొంతకాలంగా ట్రంప్ పట్టుదలగా ఉండడం గమనార్హం. ఖనిజ తవ్వకాలకు ఒప్పందం కుదిరితేనే రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని నివారించడానికి, శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నిస్తానని పట్టుబట్టి తన పంతం నెగ్గించుకున్నారు. ఇక ఏం చేయాలో దిక్కుతోచక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తలవంచక తప్పలేదు.అయితే ఈ ఒప్పందం వల్ల రష్యా యుద్ధం ఆగిపోతుందా? ఖనిజాల తవ్వకాల నుంచి వచ్చిన నిధులు ఉక్రెయిన్ పునరాభివృద్ధికి ఉపయోగపడతాయా? ఆ మేరకు అమెరికా ప్రభుత్వం సహకరిస్తుందా? అన్న ప్రశ్నలకు ఇంకా సరైన సమాధానాలు లభించడం లేదు. ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇరుదేశాలు ప్రస్తుతం గోప్యంగానే ఉంచాయి. ఈ కొత్త ఒప్పందాన్ని 'యుఎస్ ఉక్రెయిన్ రీఇన్వెస్ట్‌మెంట్ ఫండ్' అని వ్యవహరిస్తున్నారు. ఖనిజ తవ్వకాలకు ఉక్రెయిన్ వీలు కల్పించినందున దానికి ప్రతిఫలంగా ఉక్రెయిన్ 'సంయుక్త పునర్నిర్మాణ పెట్టుబడి నిధిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిధికి ఉక్రెయిన్ అమెరికా చెరిసగం నిధులు సమకూర్చవలసి ఉంటుంది. ఈ ఒప్పందంలో ఏడు ముఖ్యమైన అంశాలు ఇమిడి ఉన్నాయి.ఖనిజ వనరుల కోసం ఉమ్మడిగా అన్వేషణ చేయడం, ఉక్రెయిన్ అభివృద్ధికి పెట్టుబడులు ముమ్మరంగా ప్రవహింప చేయడం, ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పడం, పాత అప్పుల గురించి అడగకపోవడం, రష్యా పట్ల ముఖ్యంగా పుతిన్ పట్ల అమెరికా కఠిన వైఖరిని అవలంబించడం, ఖనిజ వనరుల లబ్ధి అమెరికా పొందినా కానీ యాజమాన్యం మాత్రం ఉక్రెయిన్ కిందే ఉండాలనడం, యూరోపియన్ యూనియన్‌లో చేరాలన్న ఉక్రెయిన్ చిరకాల స్వప్నానికి ఆటంకం కలగకుండా చూడడం అనే సంక్లిష్ట అంశాలు ఉన్నాయి. మరి వీటిలో ఏయే అంశాలకు అమెరికా సహకరిస్తుందో లేక తిరస్కరిస్తుందో చూడాలి.ముఖ్యంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల కఠిన వైఖరి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అవలంబించగలుగుతారా? అన్నది మీమాంసే.ఉక్రెయిన్‌కు 350 బిలియన్ డాలర్లు ఇచ్చామని, ఆ సొమ్ము తిరిగి ఇవ్వాలని ట్రంప్ గతంలో డిమాండ్ చేశారు. కొత్త ఒప్పందం ప్రకారం ఆ డబ్బును తిరిగి ఉక్రెయిన్ ఇవ్వాలిన అవసరం లేనట్టు స్పష్టమవుతోంది. ఇప్పుడు ఉక్రెయిన్‌కు తాము ఇప్పటిదాకా ఇచ్చిన దాని కన్నా అధికంగా తిరిగి పొందబోతున్నామని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ ఒప్పందం వల్ల ఉక్రెయిన్‌కు రష్యా నుంచి కానీ మరే దేశం నుంచి యుద్ధాలు తలెత్తకుండా అమెరికా నుంచి పూర్తి భద్రత లభిస్తుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎంతో ఆశిస్తున్నారు. కానీ ఇప్పుడు కుదిరిన ఒప్పందంలో భద్రతపై గ్యారంటీ మాత్రం ప్రస్తావించలేదు. మరి భద్రతపై గ్యారంటీ లేని ఈ ఒప్పందాన్ని ఉక్రెయిన్ పార్లమెంట్ ఆమోదిస్తుందా? అన్న అనుమానం కలుగుతోంది. వాస్తవానికి యుద్ధంలో ఉక్రెయిన్‌కు ఎన్నో చిక్కులు వచ్చి పడుతున్నాయి.ట్రంప్ వచ్చిన తరువాత ఏమాత్రం భరోసా లభించడంలేదు. ఈ పరిస్థితుల్లో అమెరికా మద్దతు లేకుంటే సైనికులకు ప్రమాదం తప్పదు. గట్టి భద్రత ఉక్రెయిన్‌కు కల్పిస్తామన్న గ్యారంటీకి ట్రంప్ ఇష్టపడడం లేదు. పరిమిత ప్రయోజనాలతో ఉక్రెయిన్ చివరకు ఈ ఒప్పందానికి ఒప్పుకోక తప్పలేదు. ప్రపంచం మొత్తం మీద ఉండే ఖనిజాల్లో 5% ఉక్రెయిన్‌లోనే ఉండగా, ఉక్రెయిన్ ఖనిజ లోహాల నిల్వల్లో 40% ప్రస్తుతం రష్యా నియంత్రణలోనే ఉన్నాయి. ఇవన్నీ వినియోగం కాలేదు. ప్రపంచం మొత్తం మీద ఉండే గ్రానైట్‌లో 20% ఉక్రెయిన్‌లోనే ఉంది. అలాగే ప్రపంచం మొత్తం మీద మాంగనీస్ ఉత్పత్తుల్లో ఎనిమిదో స్థానం, టిటానియం ఉత్పత్తిలో 11వ స్థానంలో ఉక్రెయిన్ ఉంది.అరుదైన ఖనిజాలు ఆరు క్షేత్రాల్లో ఉన్నాయని, నోవో పోల్టావ్ స్కే వద్ద గనుల అభివృద్ధికి 300 మిలియన్ డాలర్లు అవసరమవుతాయని జెలెన్‌స్కీ గతంలో వెల్లడించారు. కీలకమైన ఖనిజాలు వంద కన్నా ఎక్కువ నిల్వలు ఉన్నాయని, టిటానియమ్, లిథియమ్‌తోపాటు 19 మిలియన్ టన్నుల గ్రాఫైట్ నిల్వలు ఉన్నాయని ఉక్రెయిన్ చెబుతోంది. అయితే 350 బిలియన్ డాలర్ల విలువైన గనులు రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లోనే ఉన్నాయని అంటోంది. కొన్ని సహజ వనరుల సమాచారం ప్రభుత్వ రహస్యంగా ఉంచడం సోవియెట్ తరం నాటి విధానంగా ఉంటోంది. గత ఏడాది సహజ వనరుల నుంచి 1.1 బిలియన్ డాలర్లనే రాయల్టీగా ఉక్రెయిన్ ప్రభుత్వం పొందగలిగింది.రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లో ఖనిజాల తవ్వకం చేపట్టాలంటే ముందు ఆయా భూభాగాల పొరల్లో నిక్షిప్తమై ఉన్న మందుపాతరలను చాకచక్యంగా నిర్మూలించవలసి ఉంటుంది. ఈ మేరకు ఖనిజాల అన్వేషణ, సర్వే వంటి వాటికి చాలా వ్యయప్రయాసలు భరించక తప్పదు. అంతమొత్తం ఖర్చు చేయడానికి, రిస్కు తీసుకోవడానికి అమెరికా ఎంతవరకు సిద్ధమవుతుందో తెలీదు. ఇదిలా ఉండగా రష్యా యుద్ధం మరోవంక సుదీర్ఘకాలం కొనసాగుతుంటే ఉక్రెయిన్ గనుల తవ్వకం చేపట్టడం సంక్లిష్టమవుతుంది. ఉక్రెయిన్ పట్టణాలు, నగరాలు, ముఖ్యంగా ముందు వరుసలో ఉన్న ప్రాంతాలు విధ్వంసంలో ఉన్నాయి. వాణిజ్య కార్యకలాపాలు అమెరికా ప్రారంభించే ముందు ఉక్రెయిన్ మౌలిక సౌకర్యాలు చెప్పుకోతగినంతగా పునరుద్ధరణ కావలసి ఉంది.

# మద్య నియంత్రణతోనే నేరాలకు అడ్డుకట్ట!

హైదరాబాద్,భారీగా మద్యం అమ్మకాలు సాగాలన్నదే ప్రభుత్వాల లక్ష్యంగా ఉంది. మద్యంతో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రభుత్వాలు గమనించడం లేదు. మద్యం ఆదాయంతో కిలో రూపయి బియ్యం, పెన్షన్లు ఇవ్వడానికి, ఉచిత పథకాలకు ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. అందుకే మద్యనిషేధాన్ని అమలు చేయడం లేదు. తాగి చచ్చినా ఫర్వాలేదు... మద్యం అమ్మకాలు సాగాలి.. ఆదాయం పెరగాలన్న ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఇందుకు భిన్నంగా లేవు. నిజానికి ఉచిత పథకాలు ఆపితే మద్యం అమ్మకాల వైపుచూడాల్సి రాదు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై అదుపు లేకుండా పోతోంది. మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయ వనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది.విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అకృత్యాల కట్టడికి ఏం చేయాలన్నది చర్చించాలి. మహిళలపై లైంగిక నేరాలు, అత్యాచారాలకు పాల్పడు తున్న వారిలో మద్యం మత్తులో ఉన్నవారెందరన్నది గణాంకాలు తీయాలి. అలాగే ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తోంది. దీనికి తోడు గంజాయి లభ్యత కూడా పెరిగింది. చెడు సావాసాలతో మత్తులో మునిగి నేరాలకు పాల్పడుతున్నారు. దీనికంతటకీ నిరుద్యోగం, పనులు లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఇవన్నీ అరికట్టేందుకు ఏం చూయాలో ఆలోచించి ముందుకు కదిలితేనే నేరాలను అరికట్టగలం. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడుతోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చినప్పుడు నాటి సిఎం జగన్ హామీ ఇచ్చి డొల్ల కంపెనీల బ్రాండ్లతో వేలకోట్లు సంపాదించారు. మద్యం కుంభకోణంపై ఇప్పుడు సిట్ విచారణ సాగుతోంది. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. పార్టీ ఏదైనా.. కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు.అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగు తున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా



జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. ఏదైనా అరాచక సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనచేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యలకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను కూడా వదలడం లేదు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించి కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలన్నింటికి మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకం అన్నది ప్రధాన కారణమవుతోంది. పోలీసులు దర్యాప్తుల్లో ఇదే తేలుతోంది. ఆయా ఘటనల్లో నిందితులు పూటుగా మద్యం సేవించి.. ఆ మైకంలో ఉచ్ఛనీచాలు మరచి దుశ్చర్యలకు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి విచ్చలవిడిగా లభిస్తుండటంతో ఆ మైకంలో పైశాచికత్వానికి ఒడిగడుతున్నారు. అత్యాచార ఘటనల్లో అరెస్టవుతున్న నిందితుల్లో 60 శాతం మంది వరకూ మద్యం మత్తులో ఉన్నప్పుడే ఆ పైశాచిక చర్యకు పాల్పడుతున్నట్లు వెల్లడవుతోంది. మద్యం విచ్చలవిడిగా అమ్మడం,మాదక ద్రవ్యాల విషయంలో కఠిన చర్యలు తీసుకోక పోవడం వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో పాలకులు గుర్తించాలి. మత్తులో పేట్రేగుతున్న ఉన్మాదులు..వరుసగా సామూహిక అత్యా చార ఘటనలకు పాల్పడుతున్న తీరును ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచన చేయాలి. అత్యాచార ఘటనల నిరోధానికి ఉమ్మడిగా పోరాడాలి. దీనికి ఫలానా వారు ప్రభుత్వంలో ఉన్నారు కనుక వారే బాధ్యులని నిందించలేం. ఎందుకంటే వారు చేసే అకృత్యాలకు అధికారపార్టీ వారు లైసెన్స్ ఇవ్వలేదు. వారు మద్యం మత్తులో చేసే ఘటనలు కనుక మద్యం అమ్మకాలపై ఆలోచన చేయాలి. ఇలాంటి ఘటనల్లో దోషులకు కఠిన శిక్షలు వేసేలా చేయాలి. మత్తులో ఉన్నవారికి విచక్షణ ఉండదు. తమ చర్యలపై నియంత్రణ ఉండదు. పశువాంఛ బయటపడే క్రమంలో అమానుష చర్యలకు తెగబడుతుంటారు. అలాంటి సందర్భాల్లో బాధితులు ఎవరైనా వారిని ఎదిరించినా, వారి నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నించినా మరింత రెచ్చిపోతారు. హింసాత్మక చర్యలకు దిగుతారు. వీటిని మానసిక నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు. మద్యం మత్తులో ఉండే వ్యక్తికి అదే మైకంలో ఉన్న మరో ఇద్దరు, ముగ్గురు తోడైతే వారి పశుత్వానికి అడ్డూ అదుపు ఉండదు. అలాంటి సందర్భాల్లో వారికి నిస్సహాయంగా, ఎదురించలేని స్థితిలో మహిళలు ఎవరైనా కనిపిస్తే అఘాయిత్యానికి తెగబడతారు. తాను ఒక్కడినే కాదని.. తనతో పాటు మరి కొందరు ఉన్నారన్న భరోసాతో మరింతగా రెచ్చిపోతారు. తమవల్ల వారికి ఏమవుతుందో అన్న భయం కానీ..తరవాత తామేవుతామో అన్న ఆలోచనకానీ ఆ సమయంలో ఉండదు. అందువల్ల యువతకు పని కల్పించడం, ఖాళీగా లేకుండా చూడడం, మద్యంపై నియంత్రణ విధించడం అవసరం అని పాలకులు గుర్తించాలి.

# వర్షాలతో కల్లాల్లోనే తడిసిన ధాన్యం

ఖమ్మం,రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తుంటే .. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కాంటాల కోసం రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. రోజుల తరబడి వడ్లు కాంటా పెట్టకపోవడంతో ఆరిన వడ్లు మళ్లీ.. తడుస్తుండడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంటాలు పెట్టించడంలో ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సెంటర్లు ఏర్పాటుచేసి కాంటాలు పెట్టేలోపే వాన పడడంతో ఇబ్బందులు తలెత్తాయని అన్నారు.. ఈ పరిస్థితుల్లో కొన్ని చోట్ల కాంటాలు పెట్టడం ఆలస్యం అయ్యింది. కాంటాలు చేయటంలో ఎక్కడా ఆలస్యం చేయడం లేదన్నారు. సకాలంలో కాంటాలు పెట్టి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. మా ఆరుగాలపు శ్రమ ఫలించింది. పంట చేతికొచ్చింది. తేమ కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాం. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు వేస్తే ఇక ఫలితం చేతికొచ్చినట్లే..' అనుకున్న అన్నదాతలను గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అంతులేని నష్టాన్ని మిగిల్చింది. కూసుమంచి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. చేగొమ్మ గ్రామంలో ధాన్యపు రాసులు నీట మునిగాయి. గాలిదుమారానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షానికి ధాన్యమంతా తడిచిముద్దయింది. అలాగే, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడి పండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ, కల్లాల్లోనూ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. తన ఏడాది కష్టాన్ని సుమారు గంటపాటు- వచ్చిన ఈదురుగాలి, వర్షం నేలపాలు చేశాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

# కుటుంబాన్ని, పార్టీని ఇరుకునపెట్టే విధంగా ఉందా?

హైదరాబాద్,సొంత పార్టీ పరిపాలన, అందులోను తండ్రి సీఎంగా ఉన్నప్పటి ప్రభుత్వంలోని లోపాలను కవిత తప్పుబట్టడం చూస్తుంటే కేసీఆర్ విధానాలనే వ్యతిరేకించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ఆమె తెలిసే అలా మాట్లాడారా..? తెలియక మాట్లాడారా? లేదంటే కావాలనే అలా మాట్లాడారా? ఇంతకీ ఆమె మాటల వెనకున్న ఆంతర్యమేంటీ? బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత..తెలంగాణ గురించి మాట్లాడిన మాటలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో సంచలనం రేపుతున్నాయి.తన తండ్రి..మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పరిపాలన విధానాన్ని పరోక్షంగా కవిత తప్పుబట్టడం చర్చనీయాంశమవుతోంది. ఇప్పటికే కవిత పార్టీకి ప్యార్ లల్ గా జాగృతితో జనాల్ని జాగృతం చేస్తున్న ఆమె..ఇలాంటి వ్యాఖ్యల ద్వారా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారా అన్న చర్చ తెలంగాణ రాజకీయాల్లో మొదలైంది. ప్రతిపక్షాలు మాట్లాడేలా ఉన్న ఈ మాటలు అన్నది మరెవరో కాదు..సాక్షాత్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కూతురు కల్వకుంట్ల మాట్లాడిన మాటలివి.అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సరిగానే మాట్లాడారని కాంగ్రెస్ విప్ బీర్ల ఐలయ్య కౌంటర్ ఇవ్వడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది. ఎమ్మెల్సీ కవిత ఏది మాట్లాడినా ఆచితూచే మాట్లాడతారని అంతా అంటుంటారు. కానీ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను ఓ రకంగా తప్పుబడుతూ ఆమె మాట్లాడారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తండ్రి కేసీఆర్ పాలనా విధానాలను కవిత తప్పుబట్టడం చర్చనీయాంశమవుతోంది. తాజాగా ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లోనే కాదు..సొంతపార్టీ బీఆర్ఎస్ లోనూ ప్రకంపనలు రేపుతున్నాయట.

సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని ఆవేదన

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని కవిత నివాసంలో మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కవిత.. భౌగోళిక తెలంగాణ తెచ్చుకున్నప్పటికీ.. సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక తెలంగాణ దిశగా భవిష్యత్తు అడుగులు ఉండాలన్నారు. అలాగే రైతుబంధు కింద ఎకరం ఉంటే పది వేలు..పది ఎకరాలుంటే లక్ష రూపాయలు ఇచ్చామని..కానీ భూమి లేని కార్మికులకు ఏమీ చేయలేకపోయామని నాటి సీఎం కేసీఆర్ విధానాన్ని తప్పుబట్టారు. భవిష్యత్తులో భూమి ఉన్నా..లేకున్నా ఎలా ఆదుకోవాలనే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు.అంతేకాదు తెలంగాణ రాష్ట్రంలో అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉదాహరించారు. రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం 8 లక్షలు ఉంటే.. వికారాబాద్ జిల్లాలో లక్షా 58 వేలు మాత్రమే ఉందని చెప్పుకొచ్చారు. పది కిలోమీటర్లు దూరంలోనే ఇంత వ్యత్యాసం ఉండటం ప్రమాదకరమని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోవటానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు.తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత చేసిన ఈ నర్మగర్భ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రంలో సంచలనంగా మారాయి. తెలంగాణ వచ్చాక సుమారు పదేళ్ల పాటు ఆమె తండ్రి కేసీఆర్ సీఎంగా ఉన్నారు. మరి నాటి ప్రభుత్వం చేపట్టిన రైతుబంధులో తప్పులతో పాటు సామాజిక అసమానతలను కవిత ఎత్తి చూపారన్న చర్చ ఇప్పుడు రాజకీయవర్గాల్లో మొదలైందట.సొంత పార్టీ పరిపాలన, అందులోను తండ్రి సీఎంగా ఉన్న ప్రభుత్వంలోని లోపాలను కవిత తప్పుబట్టడం చూస్తుంటే కేసీఆర్ విధానాలనే వ్యతిరేకించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కేసీఆర్ కుటుంబంలో విభేదాలున్నాయని, ఎవరికి వారే యమునా తీరే అన్న విధంగా రాజకీయాలు చేస్తున్నారన్న గుసగుసలు పొలిటికల్ సర్కిల్స్ లో విన్పిస్తున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు, కవిత ముగ్గురు వేర్వేరుగా రాజకీయం చేస్తున్నారని పార్టీ వర్గాల్లో తెరవెనుక చర్చ జరుగుతోందన్న టాక్ విన్పిస్తోంది.అయితే ఇందుకు అనుగుణంగానే బీఆర్ఎస్ అధిష్టానంతో సంబంధం లేకుండా కవిత రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తూ బీసీ ఉద్యమాన్ని భుజానికి ఎత్తుకున్నారంటూ రాజకీయవర్గాల్లో గుసగుసలు విన్పిస్తున్నాయి. నిత్యం ప్రజల్లో ఉంటూ రాజకీయంగా కవిత ఫుల్ యాక్టీవ్ కావడం చర్చనీయాంశంగా మారింది.

# గృహనిర్మాణశాఖకు మంచి పేరు తేవాలి

హైదరాబాద్, గృహ నిర్మాణ శాఖకు మంచి పేరు తేవాలని ఇంజినీర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఎక్కడ తప్పు జరగకుండా చూసే బాధ్యత ఇంజినీర్లదే అన్నారు. న్యాక్‌లో 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతి పొందిన వారికి మంత్రి ఆర్డర్ కాపీలు అందజేసి మాట్లాడారు. తప్పు జరిగిందని చెబితే చాలు.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. టోల్‌ఫ్రీ నెంబర్ ఇస్తాం.. దానికి ఫోన్ చేసి వివరాలు చెప్పవచ్చు. నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలి.. దీనిలో మరో మాట లేదు. ఇళ్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత వాడుతున్నాం. ఫేజ్-1 నుంచి ఫేజ్-4 వరకు జాగ్రత్తగా సిఫారసు చేయాలి. అర్హులను ఎంపిక చేసేటప్పుడు అన్ని విషయాలూ పరిశీలించాలి. ఇళ్ల నిర్మాణంలో చిన్న ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదని పొంగులేటి తెలిపారు.

# తెలంగాణ ప్రజలకు హెచ్చరిక.. ఇలా చేస్తే.. పథకాలన్నీ కట్..



హైదరాబాద్, ఈ ఒక్క కార్డు లేకుంటే ఏ పథకం అందదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకం వర్తించాలంటే, ఈ కార్డు ఉండాల్సిందే. అందుకే సామాన్య కుటుంబాలకు ఈ కార్డు ఒక వరం. అయితే ఇటీవల కొందరు చేస్తున్న తప్పిదాలకు రేషన్ కార్డులను కూడా రద్దు చేసే రోజులు వచ్చాయి. దీనితో ఆయా కుటుంబాలు సంక్షేమ పథకాలు దూరమేనని చెప్పవచ్చు. మరెందు కు ఆలస్యం.. ఆ తప్పిదం ఏమిటో తెలుసుకుందాం. మనం చేయకుండా జాగ్రత్త వహిద్దాం.

రేషన్ కార్డు ఉంటే చాలు..

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నూతన రేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. అయితే అర్హులైన అందరికీ మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఈ దశలోనే ప్రభుత్వం రేషన్ కార్డుదారులందరికీ మేలు చేకూర్చే మరో నిర్ణయం తీసుకుంది. ఉగాది నుండి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ఏ రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తోంది. ఈ నిర్ణయంపై యావత్ తెలంగాణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సంపన్న కుటుంబాలకే పరిమితమైన సన్నబియ్యంను సామాన్య ప్రజలకు అందించడం గొప్ప నిర్ణయమని ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశంసించారు.

సన్నబియ్యం సరే.. ఇదేంటి?

తెలంగాణలో రేషన్ బియ్యం అమ్మకం ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా స్పందించింది. బియ్యం అమ్మకం నిర్ధారితమైతే, సంబంధిత కుటుంబానికి రేషన్ కార్డు రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలకు నిత్యావసరంగా ఇచ్చే సబ్సిడీ బియ్యాన్ని మార్కెట్‌లో అక్రమంగా విక్రయిస్తే ఎంత ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నది ప్రభుత్వం మరోసారి స్పష్టంచేసింది.

ఇతరుల పేర్లపై కార్డులు, బ్లాక్ మార్కెట్ కు బియ్యం

ఇటీవల ఇంటెలిజెన్స్ శాఖ నివేదికల ప్రకారం, కొన్ని మండలాల్లో నకిలీ రేషన్ కార్డులు, ఇతరుల పేర్లపై బియ్యం తీసుకొని మార్కెట్‌లో అమ్ముతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని చోట్ల అయితే కార్డుదారులే ప్రభుత్వ బియ్యం అమ్మి ప్రైవేట్ బ్రాండెడ్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమేనని అధికారులు చెబుతున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం ఆచలాపూర్ లో 11 రేషన్ కార్డులను అధికారులు రద్దు చేశారు. ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని కేజీ రూ. 16 ల చొప్పున విక్రయించినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నారు.

రేషన్ కార్డు రద్దయితే..

అక్రమంగా సన్నబియ్యాన్ని విక్రయిస్తే కార్డు రద్దు కావడం ఖాయం. అందుకే కార్డు రద్దు వరకు లబ్ధిదారులు తీసుకు వెల్లవద్దన్నది ప్రభుత్వ వాదన. కార్డు ఒక్కసారి రద్దయితే సామాన్య కుటుంబాలకు జరిగే నష్టం ఊహకు అందదు. ఏ ప్రభుత్వ పథకం వర్తించదు. అప్పుడు ప్రభుత్వం నుండి వచ్చే లబ్ధికి మనం దూరం కావడమే. అందుకే ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యాన్ని పక్కదారి పట్టకుండా చూడాల్సిన భాధ్యత రేషన్ కార్డుదారులపై ఉంది. మరి మీ పరిధిలో ఎవరైనా రేషన్ ను అక్రమంగా విక్రయిస్తుంటే, వెంటనే అధికారులకు తెలియజేయండి. అలాగే కార్డు రద్దుపై అవగాహన కల్పించండి.

# పహల్గాం తర్వాత పంజాబ్‌లో కలకలం..



న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడింది. దీంతో భారత భద్రతా దళాలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.పహల్గాం ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడింది. దీంతో భారత భద్రతా దళాలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు అమృత్‌సర్‌లో పాకిస్తాన్ గూఢచర్య సంస్థలకు రహస్య సమాచారం లీక్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం సంచలనం సృష్టిస్తోంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అరెస్టులు జాతీయ భద్రతకు సంబంధించిన కీలకమైన పరిణామంగా చూడొచ్చు. పంజాబ్ పోలీసులు అమృత్‌సర్ నుండి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారు పాకిస్తాన్ గూఢచర్య సంస్థలకు రహస్య సైనిక సమాచారాన్ని లీక్ చేస్తున్నారని వీరి పై ఆరోపణలు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించిన తర్వాత భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసిన సమయంలో ఈ అరెస్టులు జరిగాయి.పంజాబ్ డీజీపీ పోలీసులు తమ అధికారిక ఎక్స్ అకౌంట్ ద్వారా ఈ వివరాలను విడుదల చేశారు. ఈ అరెస్టులను గూఢచర్య వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. "ముఖ్యమైన గూఢచర్య వ్యతిరేక చర్యలో భాగంగా అమృత్‌సర్ రూరల్ పోలీసులు మే 3, 2025న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారు పాలక్ షేర్ మసీహ్, సూరజ్ మసీహ్. వారు అమృత్‌సర్‌లోని ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, ఎయిర్ బేస్‌ల రహస్య సమాచారం, ఫోటోలను లీక్ చేయడంలో వారి పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి. ప్రాథమిక విచారణలో ప్రస్తుతం అమృత్‌సర్ సెంట్రల్ జైలులో ఉన్న హర్‌ప్రీత్ సింగ్ ద్వారా వారికి పాకిస్తాన్ గూఢచర్య సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది" అని వారు పేర్కొన్నారు.దర్యాప్తు లోతుగా సాగుతున్న కొద్దీ మరిన్ని కీలక విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. పంజాబ్ పోలీసులు భారత సైన్యానికి అండగా నిలుస్తారని, జాతీయ ప్రయోజనాలను కాపాడడంలో తమ కర్తవ్యానికి కట్టుబడి ఉంటారని వారు స్పష్టం చేశారు. ఈ అరెస్టులు పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన రెండవ క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశం జరిగిన మరుసటి రోజు జరిగాయి. ప్రాణాంతకమైన దాడికి పాల్పడిన వారిని మట్టుబెట్టడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత సైన్యానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వర్గాలు ధృవీకరించాయి. ఈ దాడిలో ఒక ఉగ్రవాది పాకిస్తాన్ స్పెషల్ సర్వీసెస్ గ్రూప్ ( మాజీ కమాండోగా గుర్తించారు.భారత్, పాకిస్తాన్ మధ్య నియంత్రణ రేఖ కూడా కాల్పుల ఉల్లంఘనలను చూస్తోంది. పాకిస్తాన్ దళాలు వరుసగా పదవ రోజు కూడా జమ్మూకాశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెండార్, నౌషేరా, సుందర్‌బని, అఖ్నూర్ సహా అనేక ప్రాంతాలలో రెచ్చగొట్టే కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. భారత సైన్యం తగిన రీతిలో స్పందిస్తోంది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మరణించిన కొద్దిసేపటికే, ఏప్రిల్ 24, 2025న ఈ ఉల్లంఘనలు ప్రారంభమయ్యాయి. భారతదేశం సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో తీవ్రమయ్యాయి.

# పాకిస్తాన్ గగనతల నిషేధం : హైదరాబాద్, దక్షిణాది నగరాలకు నో ఎఫెక్ట్




న్యూఢిల్లీ,పహల్గామ్ దాడి నేపథ్యంలో పాకిస్తాన్ విధించిన ఆంక్షల కారణంగా ఎయిర్ ఇండియా ఉత్తర అమెరికాకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. దేశంలోని మరో నగరానికి విమానం నడిపి, ఆపై ఉత్తర అమెరికా రాష్ట్రాలకు వెళ్లే అవకాశాన్ని పరిశీలిస్తోంది. దీనివల్ల పాకిస్తాన్ గగనతలాన్ని నివారించే ఖర్చు తగ్గుతుందని వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఉత్తర అమెరికాకు 71 విమానాలను నడుపుతోంది. వీటిలో 54 సర్వీసులు ఢిల్లీ నుండి బయలుదేరుతాయి.కంపెనీ ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నట్లు తెలియజేసింది. ఇతర దేశాలలో టెక్-స్టాప్‌లను తగ్గించి, యుఎస్ కు మరిన్ని నాన్-స్టాప్ విమానాలను ప్రవేశపెట్టాలని చూస్తున్నట్లు పేర్కొంది. ఢిల్లీ , ఉత్తర నగరాల నుండి బయలుదేరే అన్ని విమానాలు అరేబియా మహాసముద్రం మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల సమయం , ఖర్చులు పెరుగుతున్నాయి. న్యూఢిల్లీ నుండి వెళ్లే విమానాలు ముంబై లేదా అహ్మదాబాద్‌ను టెక్-స్టాప్‌లుగా తీసుకుంటే, యూరోపియన్ నగరాల్లో ఆగాల్సిన అవసరం ఉండదని వార్తలు వస్తున్నాయి. అందుకే ఎయిర్ ఇండియా ఈ అవకాశాన్ని పరిశీలిస్తోంది.పాకిస్తాన్ గగనతలం మూసివేయబడటంతో ఎయిర్ ఇండియా రూ. 5200 కోట్ల నష్టాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. ఇతర భారతీయ విమానయాన సంస్థలు ప్రతి నెలా అదనంగా రూ. 306 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. యాదృచ్ఛికంగా పాకిస్తాన్ భారతీయ విమానయాన సంస్థల కోసం తన గగనతలాన్ని మూసివేసింది. అయితే అంతర్జాతీయ విమానయాన సంస్థలు స్వచ్ఛందంగా ఇతర విమాన మార్గాల కోసం చూడాలని నిర్ణయించుకున్నాయని చెబుతున్నారు. దీనివల్ల పాకిస్తాన్ తన గగనతలాన్ని ఉపయోగించుకున్నందుకు వాటి నుండి పొందే మిలియన్ల డాలర్లను కోల్పోతుంది. 2019లో పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసివేసినప్పుడు అది 10 కోట్ల డాలర్లను కోల్పోయింది.గత రెండు రోజులలో లుఫ్తాన్స, బ్రిటిష్ ఎయిర్‌వేస్, స్విస్, ఎయిర్ ఫ్రాన్స్, ఐటీఏ, లాట్ ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఇది ప్రయాణానికి అదనంగా ఒక గంట సమయం తీసుకుంటుంది. ఇంధన ఖర్చులను ప్రయాణీకులు భరిస్తున్నారు. పాకిస్తాన్ కూడా భారతదేశం తన గగనతలాన్ని మూసివేయడంతో సమస్యలను ఎదుర్కొంటోంది. కౌలాలంపూర్ విమానం 5.30 గంటలకు బదులుగా 8.30 గంటలు పడుతుంది. బంగ్లాదేశ్ , శ్రీలంకకు కూడా ఎక్కువ మార్గాలను తీసుకోవలసి వస్తుంది.అయితే భారతదేశంలోని ఉత్తర నగరాలకు ఈ సమస్య ఎక్కువ. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై , అహ్మదాబాద్ నుండి బయలుదేరే విమానాలు ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కోవడం లేదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇక్కడి నుంచి బయలు దేరే విమానాలు పాకిస్తాన్ మీదుగా వెళ్లవు.. ఇటు అరేబియా సముద్రం.. ఇటు బంగాళఖాతం నుంచి వెళతాయి కాబట్టి పాకిస్తాన్ గగనతల నిషేధం దక్షిణాది నగరాలపై ఎలాంటి ప్రభావం చూపించదు. సో ఎయిర్ ఇండియా కూడా అమెరికా సహా వివిధ నగరాలకు ఇక నుంచి ముంబై, అహ్మదాబాద్, దక్షిణాది నగరాల నుంచే ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.

# భారత అమ్ముల పొదిలో స్ట్రాటోస్పిరిక్ ఎయిర్ షిప్ డ్



న్యూఢిల్లీ,భారత సైన్యం నిఘా సామర్థ్యాలను పెంచడానికి అభివృద్ధి చేస్తున్న స్ట్రాటోస్పిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షలను భారత్ విజయవంతంగా నిర్వహించింది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఈ విమాన పరీక్షను చేపట్టింది. 62 నిమిషాల పాటు నిర్వహించిన ఈ పరీక్షకు సంబంధించిన దృశ్యాలను DRDO ఎక్స్ మాధ్యమంలో పంచుకుంది.స్ట్రాటోస్పిరిక్ ఎత్తులలో చాలా కాలం పాటు గాలిలో ఎగరగలిగేలా ఈ ఎయిర్‌షిప్‌ను రూపొందించినట్టు అధికారులు చెప్పారు. గాలి కంటే తేలికైన అధిక-ఎత్తు ప్లాట్‌ఫామ్ వ్యవస్థల సాక్షాత్కారానికి ఈ ప్రోటోటైప్ విమానం ఒక మైలురాయి అని పేర్కొన్నారు.ప్రపంచంలో చాలా తక్కువ దేశాలు మాత్రమే ఇంత సంక్లిష్టమైన వేదికను అభివృద్ధి చేశాయని అధికారులు తెలిపారు.

అభినందించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్..

ఈ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌ను దాదాపు 17 కిలోమీటర్ల ఎత్తుకు ఇన్‌స్ట్రుమెంటల్ పేలోడ్‌తో ప్రయోగించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ విమాన పరీక్ష జరిగింది. ఈ వ్యవస్థ తొలి విమాన పరీక్ష విజయవంతం అయినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవోను అభినందించారు. భారత నిఘా సామర్థ్యాలను ఈ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ మెరుగుపరుస్తుందని చెప్పారు.

# మధ్య ఆసియా దేశం నుంచి భారత్ దాడి చేసే ఛాన్సుందా..?



న్యూఢిల్లీ, పహల్గామ్ ఉగ్రదాడి దాయాదుల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాకిస్తాన్ రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు మాత్రం మేము భారత్‌ని ధీటుగా ఎదుర్కొంటామని బీరాలు పలుకున్నారు.తమ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు, ఎంత గంభీరంగా బయటకి కనిపిస్తున్నా, పాక్ నాయకత్వంలో భారత్ అంటే భయం ఉందని తెలుస్తోంది.ఇప్పటికే, బలూచిస్తాన్, ఖైబర్ ఫఖ్తుంఖ్వా వంటి సంక్షోభ ప్రాంతాల నుంచి పాక్ తన ఆర్మీని భారత సరిహద్దుల వైపు పంపించింది. ఏ క్షణాన భారత్ దాడి చేస్తుందో అని పాక్ ఎదురుచూస్తోంది. అయితే, ఇప్పుడు పాకిస్తాన్‌ని మరో అనుమానం వేధిస్తోంది. మధ్య ఆసియా దేశమైన తజకిస్తాన్‌లో భారత్‌కి మిలిటరీ బేస్ ఉంది. అక్కడి వైమానిక స్థావరం నుంచి దాడులు జరుగుతాయేమో అని పాక్ ప్రభుత్వం తెగ భయపడి పోతోంది. భారత్ వైపు తూర్పు సరిహద్దుల్లో పాకిస్తాన్ బలంగా ఉన్నప్పటికీ, ఆఫ్ఘనిస్తాన్‌ని అనుకుని ఉన్న పశ్చిమ సరిహద్దుల్లో పాకిస్తాన్ అంత స్ట్రాంగ్‌గా లేదు. 2011లో అమెరికా, పాకిస్తాన్‌లోని అబోట్టాబాద్‌లో దాగి ఉన్న ఒసామా బిన్ లాడెన్‌ని హతమార్చిన సమయంలో పశ్చిమ సరిహద్దు గుండానే యూఎస్ ఆర్మీ పాక్‌కి తెలియకుండా ప్రవేశించింది. ఇదే స్ట్రాటజీ భారత్ అవలంభిస్తే ఎలా అని పాక్ భయపడుతోంది.పాకిస్తాన్ పక్కనే ఉన్న తజకిస్తాన్‌లో భారత్‌కి వైమానిక స్థావరం ఉందని చాలా మందికి తెలియదు. ఇది పీఓకే నుంచి 600 కి.మీ దూరంలోనే ఉంది. భారత్ గత 30 ఏళ్లుగా తజకిస్తాన్‌లో తన సైనిక ఉనికిని కొనసాగిస్తోంది. 1990లలో ఆఫ్ఘన్ సరిహద్దుకు సమీపంలో దక్షిణ తజకిస్తాన్ లోని ఫారో?ర్ ప్రాంతంలో భారత సైన్యం ఒక మిలిటరీ ఆస్పత్రిని స్థాపించింది. ఆ సమయంలో తాలిబాన్ దళాలతో పోరాడుతున్న నార్తర్న్ అలయన్స్ యోధులకు వైద్య సహాయం అందించింది.ఆఫ్ఘనిస్థాన్ నుంచి సోవియట్ యూనియన్ వైదొలిగిన తర్వాత ఆ దేశంలో తీవ్ర అంతర్యుద్ధం జరిగింది. ఒక వైపు పాక్ మద్దతుతో దక్షిణ, తూర్పు ఆఫ్ఘనిస్తాన్‌పై తాలిబన్లు ఆధిపత్యం చెలాయించారు. అదే సమయంలో నార్తర్న్ అలియన్స్ ఎదురుదాడి చేసింది. ఈ సమయంలో ఫారో?ర్ లో భారత్ కీలక పాత్ర పోషించింది. ఈ యుద్ధ సమయంలోనే ఆఫ్ఘన్-తజక్ గెరిల్లా కమాండర్ అహ్మద్ షా మసౌద్ 2001లో ఆత్మాహుతి దాడిలో తీవ్రంగా గాయపడిన సందర్భంలో ఫారో?న్‌లో భారత్ మిలిటరీ ఆస్పత్రిలోనే చికిత్స పొందాడు. కానీ అతడు మరణించాడు. ఇప్పుడు, పహల్గాం ఉద్రిక్తతల మధ్య ఈ మిలిటరీ బేస్ కీలకంగా మారుతుందా..? అనే భయం పాక్‌లో నెలకొంది.

# షర్మిలకు లైన్ తెలీడం లేదా?



హైదరాబాద్,రాజకీయాల్లో ఉన్నవారికి.. ముందు తాము నడిచే దారి తెలియాలి. తాము ఎంచుకున్న మార్గంలో నడక తెలియాలి. ఈ రెండు తెలియకపోతే.. తప్పటడుగులు తిప్పలు తెస్తాయి. ఫక్తు ఏపీ కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల పరిస్థితి ఇలానే ఉందని అంటున్నారు పరిశీలకులు. ఆమె ఎంచుకున్న లైన్ ఏంటో ఆమె కైనా తెలుస్తోందా? అనేది ప్రశ్న. కొన్నాళ్లు అన్న జగన్‌పై విరుచుకుపడతారు. మరికొన్నాళ్లు.. ప్రజలంటా రు. వారి సమస్యలైనా పట్టించుకుంటున్నారా? అంటే లేనే లేదు.తాను ప్రాతినిధ్యం వహించి పోటీ చేసిన కడప జిల్లా కడప పార్లమెంటు స్థానంలోగత ఏడాది షర్మిల ఓడిపోయారు. అయితే.. అప్పట్లో తాను ఓడిపోయినా.. నియోజకవర్గానికి వస్తానని.. అక్కడే రాజకీయాలు చేస్తానని ప్రకటించారు. కానీ.. ఇప్పటి వరకు 10 మాసాలు దాటి పోయినా.. షర్మిల కడప నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. నాలుగు సార్లు ఆమె కడపకు వెళ్లినా.. తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారే తప్ప.. నియోజకవర్గం ప్రజల బాగోగులను పట్టించుకోలేక పోయారు.ఇక, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తానని చెప్పిన షర్మిల.. ఇప్పటి వరకు హైదరాబాద్, విజయవాడలలోనే మకాం పెట్టుకుని సోషల్ మీడియా రాజకీయాలకే పరిమితం అయ్యారు. ఇక, తాజాగా మోడీని తిట్టాలన్నది ఆమె కోరిక కావొచ్చు. ఎందుకంటే.. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెడుతున్నది మోడీనేనని పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె నేరుగా మోడీని కామెంట్లు చేయొచ్చు. కానీ.. అవి వర్కవుట్ అయ్యే అవకాశం లేకపోవడంతో చంద్రబాబును మధ్యలోకి లాగి మోడీని ముడిపెడుతూ.. విమర్శలు గుప్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీలోనే ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు వినిపిస్తున్నాయి.నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే. అని అంటున్న షర్మిల.. ఈ పదేళ్ల కాలంలో ఏం చేశారన్నది ప్రశ్న. నూతన రాజధానిలో మౌలిక సదుపాయాలు కల్పన కేంద్రం కల్పించి ఇవ్వాల్సిందేనని చెబుతున్న షర్మిల నాడు విభజన చ ట్టంలో ఏపీకి అన్యాయం చేసింది సొంత పార్టీనేనని కూడా చెప్పి ఉంటే.. ప్రజలు నిజంగా షర్మిలను మెచ్చుకుంటారు.ఆనాడు 2015లో మట్టి కొట్టారు. నేడు సున్నం కొట్టి వెళ్ళారు.అని చెబుతున్న షర్మిల.. విజయవాడ సమీపంలో తన సొంత ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి ఎన్నాళ్లయిందో చెప్పాలి.. మరి విల్లా కట్టడానికే అంత సమయం పడుతుంటే.. ప్రజారాజధానికి ఎంత సమయం పట్టాలి? ఏదేమైనా.. షర్మిలకు లైన్ క్లియర్‌గా లేదని అంటున్నారు పరిశీలకులు.

# పహల్గామ్ దాడి వేళ యూరప్‌లో పర్యటనలా..?



ముంబై:పహల్గామ్ ఉగ్రదాడితో దేశం మొత్తం ఆగ్రహావేశాలతో ఉంటే, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తన కుటుంబంతో యూరప్‌లో సెలవులు గడిపేందుకు వెళ్లారని శివసేన నేత మిలింద్ దేవరా ఘాటు విమర్శలు చేశారు.పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన సమయంలో ఉద్ధవ్ ఠాక్రే యూరప్‌లో హాలీడేస్ గడుపుతున్నారని మండిపడ్డారు.మహారాష్ట్ర దినోత్సవం రోజు, వారు ఒక్క మాట కూడా చెప్పకుండా అదృశ్యమయ్యారు. ఒక్క ప్రకటన, సంఘీభావం లేదు, సిగ్గు లేదు అంటూ విరుచుకుపడ్డారు. బాధితులకు, వారి కుటుంబాలకు సాయం చేయడానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వివిధ రాజకీయ నేతలను, ముఖ్యంగా శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే కృషిని మిలింద్ దేవరా కొనియాడారు. ఉద్ధవ్ ఠాక్రే పార్టీ కేవలం సోషల్ మీడియా పోస్టులకు మాత్రమే పరిమితమైందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి కూడా శివసేన(యూబీటీ) సభ్యులు ఎవరూ హాజరు కాలేదని అన్నారు.

# 13 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..!



హైదరాబాద్,తెలంగాణలో రాగల నాలుగురోజులు వర్షాలు కొనసాగుతున్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో వడగండ్ల వానలు, ప్రాంతాలలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వండగండ్ల వానలు కురుస్తుంది.జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 వేగంతో ఈదురుగాలులు వచ్చే అవకాశం ఉంది. దాంతో ఆయా జిల్లాలకు హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో గంటకు 30 నుంచి 40 వరకు వేగంతో గాలి వీస్తాయంటూ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలో ఉరుములు, మెరుపులు వానలు కురుస్తున్నాయి. ఈ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ని జారీ చేసింది ఐఎండీ హైదరాబాద్. అలాగే, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే, ఈ నెల 6, 7 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలతో పాటు సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానల పడక వాతావరణం వాతావరణశాఖ వివరించింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com